క్లుప్తంగా

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ

కల్వకుర్తి టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో పట్టణంలోని జేపీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని జిల్లా గురుకులాల అధికారి దానం సోమవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదివిన విద్యార్థులలో భరత్ 2,321 ర్యాంకు, వరప్రసాద్ 3,785 ర్యాంకులతో పాటుగా మరో నలుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను రీజినల్ గురుకులాల అధికారి వనజ ప్రశంసించారని పేర్కొన్నారు.
అమ్రాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మండలంలోని కల్ములోనిపల్లికి చెందిన కల్ముల మహేష్ ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా జనరల్ ర్యాంక్‌లో 2,776, ఎస్సీ క్యాటగిరిలో 55 ర్యాంక్ సాధించాడు.
తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని కీర్తన ఎస్సీ క్యాటగిరిలో 1,475వ ర్యాంకును సాధించినందుకు కేకేరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులు విద్యార్థినిని శాలువతో సన్మానించి అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి టౌన్: డిపో పరిధిలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లుగా డిపో మేనేజర్ శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, ఇతరులు వారి సలహాలను, సూచనలను తెలియజేయాలని మేనేజర్ కోరారు. డిపోను అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరి సహకారంతో ముందుకెళ్తామని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట వరకు 9959226292 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఓటు నమోదు చేసుకోండి

చారకొండ: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ రావు అన్నారు. మండలంలోని సోమవారం బీఎల్‌ఓలు గ్రామాల్లో ఓటు నమోదు, సవరణ, తొలగింపు, కొత్తదరఖాస్తుల స్థితిగతులపై వివరాలను సేకరించారు. ఈనెల 23 వరకు రెండో విడత ఓటర్ సమగ్ర వివరాలను నమోదు, తొలగింపు అంశాలను పరిశీలించాలన్నారు.

మట్టి తరలింపు అడ్డుకోండి

కొల్లాపూర్: ఇటుక బట్టీల కోసం అక్రమంగా నల్లమట్టి తరలింపు సాగుతోందని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలల చైతన్య సమితి నాయకులు తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని చెరువుల నుంచి అక్రమంగా తీసుకువెళుతున్నారన్నారు. కార్యక్రమంలో మద్దెల రాందాసు, అవుట శ్రీనివాసులు, బిజ్జ సురేందర్, సందీప్ తదితరులున్నారు.

'పది' టాపర్లకు సన్మానం

ఊర్కొండ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు మాదారం జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం సన్మానించారు. ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.1,116 నగదు బహుమతితోపాటు మెడల్స్ అందజేసి శాలువాలతో సత్కరించారు. జె.అఖిల, బి.అంజలి, ప్రీతి, రవళి మండలంలో టాపర్‌లుగా నిలిచారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసింహారావు, రాఘవేందర్, శ్రీనివాస్, గోపాల్, బాలయ్య, మాణిక్యం పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

లింగాల: జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బీసీ ఐక్య వేదిక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజలయ్య, సత్యం, రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో ఆరెకటికల కులస్తులతో సమావేశం నిర్వహించారు. బీసీలంతా ఏకమైనప్పుడే దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. విద్యా, ఉద్యోగ రంగాలలో రాణించాలంటే పిల్లలను బాగా చదివించాలని చర్చించారు.

ఎమ్మెల్సీ పరామర్శ

వెల్దండ: మండలంలోని కేస్లీతండా సర్పంచ్ బుజ్జి అనారోగ్యానికి గురై కల్వకుర్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో సోమవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య సమస్యను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్సీ డాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఆనంద్ కుమార్, సంజీవ్‌కుమార్, రామకృష్ణ ఉన్నారు.

వైస్ ఎంపీపీకి ఎంపీపీ బాధ్యతలు

తాడూరు: ఎంపీపీ శ్రీదేవి విదేశి పర్యటనల నిమిత్తం వెళ్లడంతో మూడు నెలలపాటు వైస్ ఎంపీపీ శివలీల ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తుందని ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. సోమవారం బాధ్యతతో కూడిన నియామక పత్రాన్ని అందజేశారు. విదేశాల నుంచి ఎంపీపీ తిరిగి వచ్చే వరకు బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రిటైర్డ్ ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌సింగ్‌కు సోమవారం నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి జూనియర్ కళాశాలలో హిందీ పండిట్‌గా పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు.

మొక్కలతోనే పర్యావరణ అభివృద్ధి

మొక్కలు పెంచడంతోనే పర్యావరణం ఎంతో అభివృద్ధి చెందుతుందని పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలను నాటారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను బతికించేలా నీళ్లు పోయాలన్నారు. గ్రామాల్లో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించి హరితహారం, నర్సరీ, పల్లె ప్రగతి అభివృద్ధి పనులు సందర్శించారు.

–సాక్షి, నెట్‌వర్క్


జిల్లా కేంద్రంలో మొక్కకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన


అచ్చంపేట మండలం సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో..


కల్వకుర్తిలో..


చారకొండ మండలం జూపల్లిలో..


వెల్దండలో..


పెంట్లవెల్లి మండలం గోపులాపూర్‌లో..


కొల్లాపూర్‌లో..


గౌరెడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీఓ


కోడేరు మండలం బావాయిపల్లిలో..


తాండ్ర జెడ్పీహెచ్‌ఎస్‌లో టీఎస్ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి


లింగాలలో షాపు తనిఖీ చేస్తున్న ఏఓ

లింగాల: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి ఫెర్టిలైజర్ షాపు డీలర్లను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనఖీ చేశారు. నిల్వ రిజిస్టర్లను పరిశీలించారు. షాపుల వద్ద బోర్డులను ఏర్పాటు చేసి ధరలను, నిల్వలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.
పెద్దకొత్తపల్లి: ఎరువుల దుకాణాల్లో రైతులు క్రిమి సంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని వ్యవసాయాధికారి రమేష్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ యజమానులు స్టాక్ బోర్డులు, ఆధార్ నమోదును తప్పనిసరి చేపట్టాలని సూచించారు. ఎరువుల దుకాణాల యజమానులు ఇచ్చిన క్రిమి సంహారక మందులు వాడొద్దని అన్నారు.

ఇళ్ల స్థలాల జీఓను పునరుద్ధరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామంటూ పేదలకు స్థలాలను పంపిణీ చేసే జీఓ రద్దు చేసిందని వెంటనే ఆ జీఓను పునరుద్ధరించాలని, నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో గాంధీ పార్కు నుంచి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో ఇళ్ల స్థలాలను ఇచ్చి వాటిని తిరిగి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వందల ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని, వాటిలో పేదలకు స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, నవీన్, శివకుమార్, సుభాష్, కుర్మయ్య, మహేష్, నాగరాజు, సుధాకర్, శివరాం తదితరులు పాల్గొన్నారు.
పెద్దకొత్తపల్లి: గ్రామాలలోని పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకున్న వారికి రూ.5 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దశరథం, బాలస్వామి, చంద్రయ్య, ఈశ్వరయ్య, రాముడు, ఎల్లేష్, జ్యోతి, ఎల్లమ్మ పాల్గొన్నారు.
పెంట్లవెల్లి: నిరుపేదలకు ఇళ్లు, రేషన్, పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల


ర్యాలీగా వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ దామోదర్‌కు అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, హనుమంతు మాట్లాడుతూ కొత్తగా పెళ్లి చేసుకున్నవారికి రేషన్‌కార్డులు మంజూరు చేయడం లేదన్నారు.
వంగూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ రాజునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని సర్వారెడ్డిపల్లి తండా, డిండిచింతపల్లి, కోనాపూర్, వెంకటాపూర్, ఉల్పరలో ఇళ్ల కోసం స్థలాన్ని సేకరించినప్పటికీ అధికారులు అర్హులకు పట్టాలు ఇవ్వడంలో కాలయాపన చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందనూలు: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో కేక్ కట్ చేశారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాగం శశిధర్ రెడ్డి, రవి, పాండు, లక్ష్మయ్య, కౌన్సిలర్ నిజాముద్దీన్, తీగల సురేంద్ర, సలీం, శ్రీనివాస రావు, శ్రీకాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.
అచ్చంపేట రూరల్: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
కొల్లాపూర్: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో భారీ కేక్ జగదీశ్వర్ కట్‌చేశారు. ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాముయాదవ్, ఖాదర్‌పాష, పరశురామ్‌నాయుడు, కాంతారావు, చిన్నకురుమయ్య తదితరులున్నారు.
బిజినేపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకల్ని మండలానికి నాయకులు ఘనంగా నిర్వహించారు. సుహాసన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ముందుగా టపాసులు కాల్చి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కత్తె ఈశ్వర్, భగవంతుగౌడ్, శ్రీను, బాలరాజు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీను, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి దాతల విరాళం

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో నిర్మిస్తున్న పోషమ్మ దేవాలయ నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ రూ.50వేల విరాళం అందజేశారు. సర్పంచ్ భూపతిరెడ్డి రూ.25వేలు, సిద్దగోని రమేష్‌గౌడ్ రూ.25వేలు, జగన్‌రెడ్డి రూ.25వేలు, యాదయ్య రూ.16వేలు విరాళాలు అందించారు. కార్యక్రమంలో మొగులయ్య, కృష్ణయ్య, రామచంద్రయ్య, వెంకటయ్య, అంజయ్య, శ్రీకాంత్, అంజయ్య, నరేష్, జంగయ్య తదితరులు ఉన్నారు.

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



మన్ననూర్: ప్రభుత్వం ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న పౌష్టిక ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు క్రమంతప్పకుండా తీసుకోవాలని సూపర్‌వైజర్ గిరిజ అన్నారు. సోమవారం అటవీ లోతట్టు ప్రాంతంలోని అప్పాపూర్, రాంపూర్ చెంచు పెంటల్లో సమావేశం నిర్వహించారు. బాలింతలకు ఆరోగ్య సంబంధిత పలు విషయాలను వివరించారు.

పేదలకు వైద్య సేవలందిస్తాం

కందనూలు: నియోజకవర్గంలో నాగం దినాకర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా పేదలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ట్రస్టు సభ్యుడు నాగం శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రజా నర్సింగ్ హోంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి నెల నిర్వహించే వైద్య శిబిరానికి హైదరాబాద్ నుంచి ప్రముఖ వైద్యులు వస్తున్నట్లు చెప్పారు. మోకాలి నొప్పులు, సంతానా లేమి, కిడ్నీ వ్యాధులతో బాధపడేవారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గడువు తేదీని పెంచాలి



అచ్చంపేట రూరల్: బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష రుణం దరఖాస్తు తేదీ గడువును పెంచాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఇటీవల సీఎం కేసీఆర్ ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రూ. రూ.3లక్షలు అందిస్తామని ప్రకటించారని, రూ. 5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్మలా, జ్యోతి, పార్వతమ్మ, సైదులు, రజిత తదితరులు పాల్గొన్నారు.
తాడూరు: బీసీ కులాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష రుణాలకు సంబంధించి జూలై 10 వరకు గడువును పెంచాలని సోమవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహమ్మద్‌అలీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, బాలస్వామి, లక్ష్మయ్య, పెంటయ్య, కురుమయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

హరితహారంతో పచ్చబడిన తెలంగాణ

ఉప్పునుంతల: ప్రభుత్వం హరితహారంలో భాగంగా ఏటా విరివిగా మొక్కలు నాటడంతోనే ఎక్కడ చూసినా పచ్చదనం నెలకొందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని ఈరట్వానిపల్లి, అయ్యవారిపల్లి, సూర్య తండా, లత్తీపూర్ శివారు డిండి కట్టమైసమ్మ వద్ద నిర్వహించిన తెలంగాణ హరితోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలు ఎక్కువగా పెంచడంతో వర్షాలు పుష్కలంగా పడటంతోపాటు మానవాళి మనుగడకు ఉపయోగపడే ప్రాణవాయువుకు కొదువలేకుండా ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలో ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, సర్పంచ్‌లు లింగమయ్య, మల్లేష్, శివ, బాలునాయక్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేష్ పాల్గొన్నారు.

హరితహారం దేశానికే ఆదర్శం

అమ్రాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం


అమ్రాబాద్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

లో హరితోత్సవ సభను ఏర్పాటు చేశారు. ముందుగా అటవీశాఖ, పోలీస్ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటారు. అనంతరం ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన అటవి దృశ్యాలను తిలకించి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. తెలంగాణ అడవి ప్రాంతం 24శాతం పెరిగిందని వివరించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో పెద్దపులుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ఉత్సవాలపై ప్రతిపక్ష పార్టీలు కుట్రపూరిత వ్యాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. పోడు భూముల సమస్య ఉన్నదని ప్రభుత్వం వాటిని పరిష్కరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డిగోపిడి, సర్పంచ్ శారద, సీఐ ఆదిరెడ్డి, ఫారెస్టు రేంజర్లు ప్రభాకర్, ఆదిత్య, పదర జెడ్పీటీసీ రాంబాబునాయక్, అచ్చంపేట ఎంపీపీ శాంతాబాయి తదితరులు ఉన్నారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు సమకూర్చాలి

అచ్చంపేట: వంద పడకల ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ప్రారంభించారని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ విమర్శించారు. సోమవారం పట్టణంలోని కొత్త ఆస్పత్రిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అస్పత్రిలో తూతూ మంత్రంగా వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. కొత్తగా వచ్చిన మెటీరియల్ లేవని, పాత భవనంలోనివి తెచ్చి ఉంచారన్నారు. డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, ఐసీయూలో ఆక్సిజన్, ఈసీజీ, ల్యాబ్ టెక్నీషియన్ లేరన్నారు. కల్వకుర్తి నుంచి కొంత మంది వైద్యులను తీసుకొచ్చి ప్రారంభించారని, ఇన్‌చార్జ్‌లు ఉన్నా వారు విధులు నిర్వర్తించడం లేదన్నారు. కొత్త భవనంలో అప్పుడే డోర్లు, కిటికీలు ఊడిపోతున్నాయని, వెంటనే వాటిని మరమ్మతులు చేయించాలని కోరారు. ఇప్పటికైన పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి నల్లమల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, గౌరిశంకర్, రామనాథం తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న వంశీకృష్ణ

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

లింగాల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు రోజులు దగ్గర పడ్డాయని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం రాత్రి డీసీసీ అధ్యక్షుడి సమక్షంలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు బలపడుతున్న పార్టీని చూసి బీఆర్‌ఎస్‌లో వణుకు పుడుతుందని అన్నారు. ప్రభుత్వ పాలన విఫలమైందని విమర్శించారు. మరోసారి గెలువాలనే ఉద్దేశ్యంతో అమలుకు నోచుకోని హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

డిగ్రీ గురుకులను మార్చాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న బీఎస్‌ఎఫ్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలను షాద్‌నగర్ నుంచి జిల్లా కేంద్రానికి మార్చాలని బీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా డీసీఓ, ఆర్సీఓ కార్యాలయాలను కొత్త కలెక్టరేట్‌లోకి మార్చాలని సోమవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది పేద విద్యార్థులకు గురుకులను జిల్లా కేంద్రానికి మారిస్తే సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుకూలంగా మెస్ చార్జీలను పెంచి నాణ్యమైన భోజనాలను అందించాలన్నారు. కార్యక్రమంలో సురేష్, శివ, రాజేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారించాలని రాస్తారోకో

బల్మూర్: మండల కేంద్రంలోని చెంచు కాలనీలో నెల రోజులుగా నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నా సర్పంచ్, కార్యదర్శి పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెంచులతో కలిసి బిందెలతో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ ఖదీర్ మాట్లాడుతూ.. గ్రామ సమీపంలో ఉన్న చెంచు కాలనీలో నీటి ఎద్దడి ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే సమస్య పరిష్కరించకుంటే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, వెంకటయ్య, సాయి, మహిళలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల కేంద్రానికి గుద్దరి పారిజాత కుటుంబానికి సోమవారం ఉప్పల ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పారిజాతకు మెరుగైన వైద్యం ఉచితంగా అందిస్తామని, ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు.

బహుమతుల ప్రదానం

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. తిమ్మినోనిపల్లి జట్టు మొదటి విజేతకు రూ.30వేలు, రాచూర్ జట్టు రెండో విజేతకు రూ.20వేల నగదు బహుమతులను అందజేశారు.

అధికారుల గైర్హాజరు

కోడేరు: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. అధికారులు ఎవరూ రాకపోవడంతో ఫిర్యాదుదారులు మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

అచ్చంపేట రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం సభ్యుడు వెంకట్‌నాయక్ అన్నారు. సోమవారం లింగోటంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు అధికంగా అవుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ, వ్యక్తిగత సమాచారం ఇతరులకు చెప్పొద్దని సూచించారు. విద్యార్థినులు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్మికులకు పీఆర్‌సీ అమలు చేయాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే 30శాతం పీఆర్‌సీని అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ.. 9 నెలల క్రితం రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులకు పీఆర్‌సీని వర్తింపచేసిన ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు మాత్రం మరిచిందన్నారు.
తెలకపల్లి: పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ భాస్కర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ మాట్లాడుతూ హక్కులు సాధించుకోవడానికై జూలై 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైదులు, లింగస్వామి, రాజు, లక్ష్మయ్య, శివ, నాగులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 68 ప్రకారం వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం జీవో నంబర్ 68 ప్రకారం జనరల్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్, పేషంట్ కేర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూపరింటెండెంట్ రఘుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 2017లో ఆస్పత్రి సామర్థ్యానికి అనుగుణంగా జీవో 68 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని టెండర్ దక్కించుకున్న ఏజెన్సీ కాంట్రాక్టర్ భారీ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం కార్మికుడికి రూ.9,600 చెల్లించాల్సి ఉన్నా రూ.7,600 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ప్రస్తుతం కార్మికులకు రూ.11,600 పైగా వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ అక్రమాలు, ఆగడాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివశంకర్, మధుగౌడ్, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.